క్లుప్తంగా

దిగవల్లి వెంకట రత్నాంబ కన్నుమూత


రత్నాంబ (ఫైల్)

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య సమరయోధులు దివంగత దిగవల్లి సూర్యప్రకాశ రావు భార్య వెంకట రత్నాంబ (99) శనివారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. రత్నాంబ రాజమహేంద్రవరం వాస్తవ్యులు, సంచలన గౌతమీ టైమ్స్ పత్రిక చీఫ్ ఎడిటర్, దివంగత దిగవల్లి శివరామ్ కుమార్ తల్లి. రత్నాంబ చిన్న కుమారుడు శివరామ్ కుమార్ సంచలన గౌతమీ టైమ్స్ పత్రికతో రాజమండ్రి వాసులకు బాగా సుపరిచితమే. ఆయన తన పత్రిక ద్వారా అనేక సంచలన కథనాలు రాశారు. తర్వాత తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నారు. క్రమంగా ఆ పత్రిక మూతపడింది. కొన్నేళ్లకు శివరామ్ కుమార్ ఆరోగ్యం క్షీణించి కిడ్నీల సమస్యతో బాధపడ్డారు. 2017లో హైదరాబాద్ నిమ్స్‌లో తుది శ్వాస విడిచారు. రత్నాంబకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. ఢిల్లీలోని బీబీసీ న్యూస్‌లో పనిచేస్తున్న ఆమె ఆఖరి మనవడు జర్నలిస్ట్ దిగవల్లి పవన్ కాంత్ ఆదివారం హైదరాబాద్‌లో రత్నాంబ అంతిమ సంస్కారాలను నిర్వహించనున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడు (ఫైల్)

కడియం: వేమగిరి వద్ద కాలువలోకి దూకిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 27వ తేదీన కాలువలోకి దూకిన వృద్ధుడిని స్థానికులు రక్షించి, కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం తరలించారు. ఆ వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. అతడి వివరాలు మాత్రం తెలియలేదు, ఆచూకీ తెలిసిన వారు కడియం పోలీసులను తెలిపాలని కోరారు.

విద్యుత్ వేళల మార్పు

కడియం: మండలం పరిధిలోని నర్సరీ రైతుల విజ్ఞప్తి మేరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాను తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 12 గంటల వరకు మార్పు చేసినట్లు విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు. పగటిపూట విద్యుత్ సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఈ విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

మంత్రి వేణు భార్య వరలక్ష్మి ప్రచారం


వేమగిరి తోటలో ప్రచారం చేస్తున్న మంత్రి వేణు భార్య వరలక్ష్మి

కడియం: మండలంలోని వేమగిరి తోటలో శనివారం మంత్రి వేణు భార్య వరలక్ష్మి విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నరాల గణపతి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. నవరత్నాలతో పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా వేణు, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పితాని శ్రీను, నరాల శ్రీను, గుబ్బల నాగార్జున, కట్టా జమిందార్, పితాని హరికృష్ణ, నరాల మోహన్, వాసంశెట్టి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ విస్తృత దాడులు


సారా, నిందితుడితో సెబ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు శనివారం రాజానగరం మండలం సూర్యారావుపేటలో సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బంది విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కేసు నమోదు చేసి, 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సూర్యారావుపేటకు చెందిన మార్గాని పెద వీర్రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

కడియం: భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీ రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పడమట గణేష్ రావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి సూరిబాబు అన్నారు. వీరు శనివారం కడియం అంబేడ్కర్ సెంటర్లో విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక బీఎస్పీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం


మాధవరాయుడుపాలెంలో ఓటర్లకు నమస్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి అందరూ బాసటగా నిలవాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరు వెంకటగిరి కొండపై వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, మీ కుటుంబంలో మేలు జరిగితేనే ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే తనను, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు కుట్రలతో నేడు అవ్వాతాతలు బ్యాంకుల వద్ద ఎండతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఉసురు చంద్రబాబు కూటమికి తగులుతుందన్నారు. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయితే పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబును నమ్మి ఓటేస్తే పథకాలకు ముగింపేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దాల అను, యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, సుబ్బారెడ్డి, ఎలుగొండ లక్ష్మి, దాకే శ్రీను, వైఎస్ కుమార్, షేక్ సమీరా, నాగులపల్లి ఆశ, తోడేటి రాహుల్, చరణ్, సత్తార్, లారీ శ్రీనివాస్, షేక్ ఇమామ్, సోమన శ్రీను, కోటిపల్లి రవి, కాకులపాటి కుమార్ పాల్గొన్నారు.


బొమ్మూరు వెంకటగిరికొండపై ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

మనసున్న ముఖ్యమంత్రి జగనన్న

కడియం: మనసున్న పేదల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మాధవరాయుడుపాలెంలో సంగీతం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి జగన్ ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పాలన, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో యాదల సతీష్ చంద్రస్టాలిన్, తాడాల చక్రవర్తి, కొండపల్లి పట్టియ్య, తోకల శ్రీను సాపిరెడ్డి సూరిబాబు, ఈలి గోపాలం, టీకే శ్రీను, సంగీతం సూరిబాబు, సాపిరెడ్డి కామేష్, సింగన చంద్రరావు, సింగన శివరామ్, కొప్పిరెడ్డి విజయ్, బాబురావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నగరానికి పూర్వ వైభవం


నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెంపునకు కృషి
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. నగరంలోని 3, 4, 5, 10, 11 డివిజన్లలో శనివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇప్పటి వరకూ నగరాన్ని పాలించిన టీడీపీ ఎన్డీఏతో కలసి ఉన్నప్పుడు నిధులు తీసుకు రాలేకపోయిందన్నారు. ఇప్పుడు ఎంపీగా తాను అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నేతలు కడుపుమంటతో లేనిపోని విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి అభివృద్ధి పనినీ అడ్డుకోవడానికి రకరకాలుగా ప్రయత్నించారని, వాటన్నిటినీ సమర్థవంతంగా తిప్పికొట్టి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.వందల కోట్లు తీసుకొచ్చి విమానాశ్రయం, రైల్వే స్టేషన్, మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, జాతీయ రహదారుల అభివృద్ధి ఇలా ఎన్నో చేసి చూపానన్నారు. నగరంలోని పార్కులను అత్యద్భుతంగా తీర్చిదిద్దానన్నారు. హ్యాపీ స్ట్రీట్, ఈట్ స్ట్రీట్, పుష్కర్ ప్లాజా, యాంఫీ థియేటర్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కేవలం రెండే సంవత్సరాలలో చేసి చూపానన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అధికారం ఇస్తే నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. 16 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న ఆదిరెడ్డి కుటుంబం నగరానికి, ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను చేసిన అభివృద్ధిపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

నగరాభివృద్ధికి పది ప్రమాణాలు


మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, రౌతు సూర్యప్రకాశరావు, చందన నాగేశ్వర్

- మేనిఫెస్టో రూపొందించిన ఎంపీ భరత్‌రామ్
- నగర ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ 10 ప్రత్యేక ప్రమాణాలతో ప్రత్యేక మేనిఫెస్టో సిద్ధం చేసి నగర ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. భరత్ టెన్ ప్రామిసెస్ పేరుతో ఈ మేనిఫెస్టోను శనివారం నగరంలోని పుష్కర్ ఘాట్ వద్ద రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలసి ఆవిష్కరించారు. ఇందులో ప్రధానంగా నగరంలో రౌడీ షీటర్లు, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ వంటి సంఘ విద్రోహక శక్తులను నగర బహిష్కరణ చేయడం, వారిలో పరివర్తన వచ్చిన తరువాత తిరిగి నగరంలోనికి అనుమతించడం, నగర వాసులకు 24 గంటలూ రక్షిత తాగునీటి సరఫరా, నగరంలోని యువతకు పదివేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, రివర్ సిటీ అందాలు చూసేలా ఘాట్లను ఏకం చేయడం, గోదావరి బండ్‌ను హైదరాబాద్ టాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయడం ఉన్నాయి. అలాగే నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడం, మూడు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకురావడం, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు, జగనన్న కాలనీలలో 40 వేల మందికి ఇళ్ల కట్టించి లబ్ధిదారులకు అప్పగించడం, మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మాదిరిగా లాలాచెరువు, పిడింగొయ్యి, బొమ్మూరు, వేమగిరి జంక్షన్లలో కూడా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణం తదితర వాటిని చేపడతానని భరత్‌రామ్ పొందుపరిచారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ గుడ్ మార్నింగ్, రాజన్న రచ్చబండ కార్యక్రమాలు, ప్రతి వారం అధికారులతో రివ్యూ నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకునై ప్రజలకు సేవలందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, పోలు విజయలక్ష్మి, బొమ్మన జయకుమార్, నందెపు శ్రీనివాస్, పాలిక శ్రీనివాస్, అశోక్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎంల కమిషనింగ్


కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ: ఎటువంటి అపోహలకు తావులేకుండా అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ (పనితీరు పరిశీలన) చేస్తున్నామని ఎన్నికల సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో జరుగుతున్న రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనింగ్ కోసం 20 టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. అలాగే మాక్ పోల్ నిర్వహించటానికి పూర్తి స్థాయిలో సిబ్బంది నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాస్ సేవలు అభినందనీయం


వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలిసిన ఎన్ఆర్ఐలు

రాజమహేంద్రవరం సిటీ: కరోనా సమయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అందించిన సేవలు అభినందనీయమని ఎన్ఆర్ఐ ప్రతినిధులు కొనియాడారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న వారు శనివారం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సేవాభావం కలిగిన డాక్టర్ శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కలిసిన వారిలో ఎన్ఆర్ఐలు కార్తిక్ ఎల్లాప్రగడ, భావిగడ్డ బ్రహ్మానందరెడ్డి, సారథిరెడ్డి వంగా, వినోద్ పేరూరి, కిషోర్ యాదవ్ తనిమికి, కుమారస్వామి, కామేష్ తాతపూడి ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, టీకే విశ్వేశ్వర్ రెడ్డి, లిడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ తగరం సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకం


ఓటు చైతన్యంపై నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

కంబాలచెరువు: రానున్న ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తన ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. జిల్లా సమగ్ర శిక్షా, విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కోట గుమ్మం సమీపంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పుష్కరఘాట్, మెయిన్ రోడ్ శివుని బొమ్మ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుభాషిణి, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మోదీ బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

కడియం: మండలంలోని వేమగిరిలో జాతీయ రహదారి పక్కన గల స్థలంలో సోమవారం బీజేపీ, టీడీపీ, జనసేన నిర్వహిస్తున్న విజయ శంఖారావం బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ సభలో పాల్గొంటారని ఆయా పార్టీల నాయకులు తెలిపారు. బొమ్మూరు భూలోకమ్మ గుళ్ళు సమీపంలోని పొలంలో ఈ ముగ్గురికి వేర్వేరుగా హెలీప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రధానమంత్రి భద్రత అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్పీ పి.జగదీష్, అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్, సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు కాపు సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న నందెపు శ్రీనివాస్

ప్రకాశం నగర్: స్థానిక జేఎన్ రోడ్డులోని చెరుకూరి గార్డెన్స్‌లో ఆదివారం కాపు సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నగర కాపు సంఘం అధ్యక్షులు నందెపు శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎస్‌వీజీ మార్కెట్‌లోని బోడా ఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కాపులకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ఆర్థిక లబ్ధిని, భవిష్యత్తులో అందించే సంక్షేమ పథకాలను ఆత్మీయ సమ్మేళనంలో వివరిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో కాపులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో కాపులు నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగిన నేపథ్యంలో వారి అభివృద్ధికి కారకులైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సమావేశంలో బొంతా శ్రీహరి, ఇసుకపల్లి శ్రీనివాస్, పురంశెట్టి ప్రసాద్, దూలం ప్రసాద్, ఆకుల ప్రకాష్, చోడి శెట్టి సత్యవాణి పాల్గొన్నారు.

జగన్ పాలనకు అందరి మద్దతు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- వైఎస్సార్ సీపీలో 500 మంది చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ, గొందేశి శ్రీనివాసులురెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలూ మద్దతు తెలుపుతున్నారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక 16వ డివిజన్‌లో టీడీపీకి చెందిన సుమారు 500 మంది శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆవ రోడ్డు, వీరభద్రనగర్, శాంతినగర్, రైతు నగర్, వాంబే కాలనీలకు చెందిన బుంగా ఏలీయా, బుంగా జాను, గాంధీ, రమేష్, గోవింద్, తేజా, మహేష్, చిన్న, బాలు, నవీన్, వెంకటేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందించడం ద్వారా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పర్చుకున్నారన్నారు. ఆయన ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలందరూ టీడీపీ కూటమిని శాశ్వతంగా సాగనంపాలన్నారు.

వాహనాల తనిఖీ

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో వాహనాలను శనివారం అధికారులు తనిఖీ చేశారు. రాపాక – కోటికేశవరం రోడ్డులో వాహనాలను నిలిపి క్షుణంగా పరిశీలించారు. తనిఖీ నిర్వహించే సమయంలో ఫొటోలు, వీడియోలు తీశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రోడ్డుపై పయనించే వాహనాలను, రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డులో కూడా వాహన తనిఖీలు చేశారు. అనంతర విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో డబ్బు తీసుకువెళ్లేందుకు కొన్ని నిబంధనలు ఉన్నాయన్నారు. ప్రజలు రూ.49,999 వరకు నగదు తీసుకువెళ్లవచ్చని, రూ 50 వేలు పైబడి ఉంటే ఆధారాలు చూపాలన్నారు. అలాగే రూ 10 వేల పైబడి విలువగల ఆర్టికల్స్ కొనుగోలు చేస్తే తగిన రశీదులు, ఆధారాలు చూపాలని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి, నగదును తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (న్యూ క్యాంపస్)లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ నెల 6న తేదీ ఉదయం 8 టల నుంచి ఎన్నికల విధులలో పాల్గొను అధికారులు (సెక్టార్, బూత్ లెవెల్ అధికారులు, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు) పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో రేండమైజేషన్ తరువాత రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఎన్నికల విధులలో ఉన్న పీఓలు, ఏపీఓలు పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఏడో తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ అత్యవసర శాఖల సిబ్బందికి అవకాశం ఉంటుందన్నారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో ఏడో తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు ఎన్నికలలో విధులలో పాల్గొనే జిల్లా పోలీసు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు తమ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోవాలన్నారు. ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (న్యూ క్యాంపస్)లో 8వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు ఎన్నికల విధులలో రెండవ రెండమైజేషన్ తరువాత రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఓపీఓలు, ఇతర ప్రభుత్వ అధికారులకు ఓటు వేయాలన్నారు.